చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం



కోయిల్‌సాగర్ కాల్వకు సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల

దేవరకద్ర, డిసెంబర్ 25 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల నుంచి ఆయకట్టు రైతులు యాసంగి పంట సాగు చేసేందుకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు ఉండవని, అయితే రైతులు సాగునీటిని వృథా చేసుకోకుండా వాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ప్రకృతి సిద్ధంగా కొండల నడుమ ఆహ్లాదకరమైన, అద్భుతమైన వాతావరణంలో ప్రాజెక్టు ఉందన్నారు. సీఎం దృష్టికి తీసుకుపోయి దీనిని త్వరలో పర్యాటక ప్రాంతంగా మారుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భారతిరెడ్డి, ప్రాజెక్టు చైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, డీఈ చందు, మండల పార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్, ఫారుఖ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీవో రాష్ట్ర నాయకులు

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, డిసెంబర్ 25 : మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేలను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నూతన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణాగౌడ్ పరిచయం చేశారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి వరప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు యాదగిరి, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బాలుయాదవ్, తానాజీ, మహిళా ఉపాధ్యక్షురాలు సంధ్య, సంయుక్త కార్యదర్శులు డా.నరేశ్, జాకీర్‌అహ్మద్, ఆఫీస్ సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి, క్రీడా కార్యదర్శి కరణంరాజు, కార్యవర్గ సభ్యులు ఇమ్రాన్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబర్ 25 : రాష్ట్రంలో సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలు స్థాపించి బీసీలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన వివిధ కులాలతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం ఎంఎస్ఎం ఈ పాలసీ స్టడీ కమిటీని ఏర్పాటు చేశారని, అందులో తనకు అవకాశం కల్పించారని చెప్పారు. బీసీలను పారిశ్రామిక వేత్తలుగా అవకాశాలు కల్పించడం కోసం ఈ కమిటీని ఏర్పాటు చేసినందుకు ముఖ్య మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానారు. ఎంఎస్ఎం ఈ పాలసీ స్టడీ కమిటీ చైర్మన్‌గా ఒక బీసీ బిడ్డను నియమించడం తోపాటు పలువురు ఐఏఎస్‌లను సై తం ఇందులో మెంబర్లుగానియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి



మక్తల్‌లో వాజ్‌పేయి జన్మదినాన్ని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జడ్చర్ల/మక్తల్/కృష/ హన్వాడ/ మరికల్/ ధన్వాడ, డిసెంబర్ 25 : మాజీ ప్రధాన మంత్రి అటల్‌బిహారి వాజ్‌పేయి జయంతిని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు. హన్వాడ మండలంలోని వేపూర్, హన్వాడ గ్రామాల్లో వాజ్‌పేయి జయంతిని నిర్వహించారు. అనంతరం కేజీబీవీ విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగలకు రిమాండ్

మక్తల్, డిసెంబర్ 25 : గొర్రెల దొంగతనానికి పాల్పడిన నిందితులను రిమాండ్ చేసినట్లు మక్తల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొర్రెల చోరీకి సంబంధించిన కేసు వివరాలను సీఐ వెల్లడించారు. మక్తల్ మున్సిపాలిటీలోని రెండో వార్డు, దండు శివారులో మక్తల్ పట్టణం యాదవనగర్‌కి చెందిన కర్నె పెద్ద సబెన్న ఈనెల 21న అర్ధరాత్రి గొర్రెల మంద ఆపుకొని నిద్రిస్తున్న క్రమంలో 15 గొర్రెలు గుర్తు తెలియని నిందితులు ఎత్తుకెళ్లారు. మరుసరి రోజు సైతం తిరుమలాపురం శివారులోని కుర్వ శివలింగప్పకు చెందిన మంద నుంచి కూడా గొర్రెలను ఎత్తుకెళ్లారు. శివలింగప్ప గొర్రెల దొంగలను వెంబడించగా వారు ఒక తెల్ల సుమో కారులో పారిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విచారణ నిర్వహించి గొర్రెలు ఎత్తుకెళ్లిన రమ్య అలియాస్ హనుమంతయాదవ్, జింకేరితండా, యాదగిరి జిల్లా, బసప్ప రాథోడ్ అలియాస్ బసప్ప బలిచక్రం తండా, కీరప్ప హాన్ అలియాస్ బీరప్ప బలిచక్రంతండా యాదగిరి జిల్లా వారీగా గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరిలో రమ్య అలియాస్ హనుమంత ఏ1, బసప్ప రాథోడ్ అలియాస్ బసప్ప ఏ2, బీరప్పను ఏ3గా కేసు నమోదు చేసి, 15 గొర్రెలను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, రెండో ఎస్సై ఆచారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు 3రోజుల అంతరాయం

నారాయణపేట టౌన్, డిసెంబర్ 25 : సింగారం చౌరస్తావద్ద భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో పట్టణంలో మూడురోజులపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. దీంతో 26, 27, 28 తేదీల్లో పట్టణంలో తాగునీటి సరఫరా ఉండదన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

యేసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం తదితరులు

పాలమూరు, డిసెంబర్ 25 : మహబూబ్‌నగర్ ఎంబీ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్టింగ్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసుక్రిస్తు బోధనలు ఆచరణీయం అని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని క్రీస్తు బోధనలు భావితరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీవర్చి సీనియర్ ఫాదర్ వర ప్రసాద్, బ్రదర్ ప్రేమ్‌కుమార్, శాంసన్, రాజు, అబ్రహం, శరత్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అలీ, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అనితామధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు జీవితం ఆదర్శప్రాయం

దేవరకద్ర, డిసెంబర్ 25 : యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంబీ చర్చిలో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జన్మదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్లలో క్రిస్మస్ వేడుకలు

జడ్చర్ల, డిసెంబర్ 25 : జడ్చర్ల మండలంలోని మున్సిపాలిటీతోపాటు వివిధ గ్రామాలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిష్టియన్లు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాల్లో రెవరెండ్ యోనాతాన్, ఫిలెమోన్, టైటస్‌పాల్, ప్రీతం, నిత్యానందం తదితరులు ఉన్నారు.

కౌకుంట్ల, చిన్నచింతకుంటలో..

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), డిసెంబర్ 25 : కౌకుంట్ల, చిన్నచింతకుంట మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో బుధవారం ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చింతకుంట మండలంలోని చర్చిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, డిసెంబర్ 25 : మండలకేంద్రంతోపాటు కొల్లూరు, పెద్దపొర్ల, బిజ్వారం గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రీస్తు జన్మదిన వేడులకు క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి పాస్టర్లు క్రీస్తు జన్మదిన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు కొండన్ గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల చర్చిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 25 : అడ్డాకుల ఎంబీ సీయోను సంఘం చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మత పెద్దలు, క్రైస్తవ కుటుంబ సభ్యులతోపాటు కలిసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశా రు. మాజీ జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి, మత పెద్ద చంద్రశేఖర్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఖాజాగోరి, రాములు, ఆనందం, దానియేలు, డేవిడ్, శ్యామ్, విజయ్‌కుమార్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, శ్రీనివాసులు, గంగిరెడ్డి, కృష్ణయ్య, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలో..

కృష్ణ, డిసెంబర్ 25 : మండలంలోని తంగిడి, గుడెబల్లూర్ పరిధిలోని వాసునగర్ గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సా యంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, డిసెంబర్ 25 : మండల కేంద్రంతో పాటు తీగల్‌పల్లి, మల్లారెడ్డిపల్లి, కూచూర్, కారూర్, దాయపంతులపల్లి, చౌదూర్, పోమాల, కామారం తదితర గ్రామాల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగానే ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దుస్తులు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, కాంతామణి, డానియేల్, శామ్యూల్, శివకుమార్, వెంకటయ్య, యాదయ్య, ఉమాపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, డిసెంబర్ 25 : మండల కేంద్రంతోపాటు మున్ననూర్, దోనూర్, రెడ్డిగూడ, కొత్తూర్, వెలుగొమ్ముల తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. మార్కెట్ కమిటీ చైరపరన్స్ జ్యోతితో కలిసి సంఘం సభ్యులు కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

మక్తల్‌లో..

మక్తల్, డిసెంబర్ 25: క్రిస్మస్‌ను పురస్కరించుకొని బుధవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి క్రైస్తవులతో కలిసి వివిధ చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మక్తల్ మండలం మంథన్‌గోడ్, నర్వ మండలకేంద్రంలో నిర్వహించిన వేడుకల్లోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మరికల్‌లో..

మరికల్, డిసెంబర్ 25 : మండలంలో క్రిస్మస్ వేడుకలను ఇబ్రహీంపట్నం, తీలేరు, మరికల్ తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలో క్రైస్తవులు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాస్, జాన్, జైపాల్, కృష్ణయ్య, రాజు, శివ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

జడ్చర్ల : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

మహ్మాదాబాద్, డిసెంబర్ 25 : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు భీంరెడ్డి, పుట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు ఆ సంఘం నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఖాదర్, బసయ్యతోపాటు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

నారాయణపేట టౌన్, డిసెంబర్ 25 : సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్రసహాయ కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. తమడిమాండ్ల పరిష్కారానికి సమగ్రశిక్షా ఉద్యోగులు పట్టణంలోని మున్సిపల్‌పార్క్ వద్ద చేపట్టిన దీక్ష 14వ రోజైన బుధవారం కొనసాగింది. ఈ దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపిన అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గత 16 రోజులుగా సమ్మెచేస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. రెండు దశాబ్దాలుగా చాలిచాలని జీతాలతో పనిచేస్తున్నా సమగ్రశిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి నర్సింహా, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వెంకట్రాములు, గౌరమ్మ, విజయ, శివకుమార్, రాజు, మహిపాల్, అల్తాఫ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, డిసెంబర్ 25 : సైబర్ నేరాగాళ్ళు చూపే మోసపూరిత ఆశలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ రుణ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోరాదని, రుణయాప్‌ల ద్వారా మోసానికి గురైతే బాధపడరాదని, క్షణికావేశాలకు గురికావొద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

కన్మనూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మరికల్, డిసెంబర్ 25 : మండలంలోని కన్మనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. ఈసందర్భంగా పాఠశాలలో చదువుకున్న రోజులను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

మనుధర్మ గ్రంథప్రతులు దహనం

ఊట్కూర్, డిసెంబర్ 25 : అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బుధవారం వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి గ్రంథ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు దుర్గం శ్రీనివాసులు, దశరథ్ మాట్లాడుతూ బ్రాహ్మణీయ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో అశోక్, భరత్, బలరాం, పరశురాం, రాజు, శివలింగప్ప పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

హన్వాడ, డిసెంబర్ 25 : సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య అన్నారు. బుధవారం మండలంలోని బుద్దారంలో ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం జనవరి 19న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ మహాగర్జనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

ఆర్చరీలో బంగారు పతకం

మహబూబ్‌నగర్ అర్బన్,డిసెంబర్ 25 : తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు రమావత్ రవినాయక్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా రిషి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు. వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే ఆర్చరీ పోటీలో రవినాయక్ పాల్గొంటాడని కోచ్ జ్ఞానేశ్వర్ తెలిపాడు.

108లో ప్రసవం తల్లీబిడ్డా క్షేమం

హన్వాడ, డిసెంబర్ 25 : హన్వాడ మండలం టంకర గ్రామానికి చెందిన నాగలక్ష్మి పురిటినొప్పులు అధికం అవ్వడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే 108 గ్రామానికి చేరుకొని నాగలక్ష్మిని హన్వాడ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు తీవ్రమై అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని 108 సిబ్బంది హన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడ్మిట్ చేశారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తెలిపారు. సకాలంలో స్పందించిన సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించిన 108 ఈఎంటీ మహబూబ్ బాషా, పైలట్ శివశంకర్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

ఆటో ఢీ : బాలుడు మృతి

మిడ్జిల్, డిసెంబర్ 25 : ఆటో ఢీకొట్టడంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని బోయిన్‌పల్లిలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల సమాచారం మేరకు రెహాన్(4) ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. అయితే మిడ్జిల్‌కు చెందిన ఫిల్టర్ వాటర్ ఆటో ఇంటి సమీపంలో వాటర్ పోసిన తర్వాత ఆటోను రివర్స్ చేస్తుండగా బాలుడు మీదుగా వెనుకకు ముందుకు పోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాలుడిని జిల్లా కేంద్రంలో దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్యాలెండరను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

బీసీ జాగృతిసేన క్యాలెండర్‌ను ఆవిష్కరణ

జడ్చర్ల, డిసెంబర్ 25 : బీసీ జాగృతిసేన న్యూ ఇయర్ క్యాలెండర్‌ను బుధవారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఆవిష్కరించారు. జడ్చర్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బీసీ జాగృతిసేన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రశేఖర్ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం పనిచేస్తున్న బీసీ జాగృతిసేన మండల కమిటీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో నిరంజన్, నర్సింహులు, గోపాల్, శేఖర్, శ్రీనివాస్, మురళి, పర్శవేది తదితరులు ఉన్నారు.

హేమలత కుటుంబాన్ని పరామర్శ

జడ్చర్ల, డిసెంబర్ 25 : జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌చారి మాతృమూర్తి పెండ్యాల హేమలత ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. బుధవారం ఆమె దశదిన కర్మను నిర్వహించగా విషయం తెలుసుకున్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సంతోష్‌చారి ఇంటికి వెళ్లి హేమలత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎర్రశేఖర్ వెంట బీఆర్ఎస్ నాయకులు మాచారం నర్సింహచారి, కరాటేశ్రీను పర్శవేది తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బాలానగర్, డిసెంబర్ 25 : బాలానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. బాలానగర్, గౌతాపూర్, నేర్లపల్లి, కేతిరెడ్డిపల్లి, మోతీఘణపూర్, అమిత్‌కాటన్‌మిల్, గుండేడు ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ విజేత అడ్డాకుల జట్టు

విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 25 : అడ్డాకులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మద్దూరు సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల్లో అడ్డాకుల జట్టు విజేతగా నిలువగా, వనపర్తి జిల్లా పెద్దమందడి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ పోటీల్లో మొత్తం 44 జట్లు పాల్గొన్నాయి. ముగింపు ఫైనల్ పోటీలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.30 నగదు, రన్నర్ జట్టుకు రూ. 20వేలు నగదుతో పాటు షీల్డ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, క్రీకారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబ్బులు మంజూరు చేయాలి

ధన్వాడ, డిసెంబర్ 25 : తెలంగాణ ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు రూ.12వేలు ఏడాదికి బ్యాంకుఖా